జిందగీ

# చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 17 ఫిబ్రవరి 2025
www.ntnews.com





భారతీయ సంస్కృతి అతి విశిష్టమైనది. మన చుట్టూ ఉండే ప్రకృతి, మనం నివసించే భూమి, మూలమైన సూర్యుడు అన్నిటినీ వేర్వేరు సమయాల్లో ఆరాధించే క్రమంలో ధర్మశాస్త్రాన్ని రూపొందించుకున్న వైజ్ఞానిక సంస్కృతి భారతీయమైనది. ప్రతీ విషయాన్ని ప్రతీకలుగా చెప్పడంలో భారతీయ పురాణాదులకు సాటిలేదు. అర్థం కానంతవరకు అవి పుక్కిటి పురాణాలే. అర్థమైతే అద్భుతమైన వైజ్ఞానిక మార్గం.

# విజ్ఞాన శిఖరం.. శ్రీచక్రం



హైందవ ఆధ్యాత్మిక విధానంలో కనిపించే ప్రతి దైవ ప్రతిమ ఒక వైజ్ఞానిక భావానికి, ఖగోళానికి, భూగోళానికి, ప్రకృతికి ప్రతీకలుగానే ఉంటాయి. చూసే దృష్టి ఉంటే అంతా విశ్వమయమే. అతి పెద్ద శక్తులకు ఒక రూపాన్ని ఇచ్చి, ఆ రూపారాధన ద్వారా మూలశక్తిని ఆరాధించే గొప్ప వైజ్ఞానిక సంప్రదాయం భారతీయులదే. ఆ రూపాన్ని, ధ్యాన శ్లోకాన్ని, మంత్రాన్ని, అక్షరాలను జాగ్రత్తగా గమనిస్తే ఎన్నో ప్రత్యేక విషయాలు మనకు కనిపిస్తాయి.

మన సంస్కృతిలో అత్యంత ప్రముఖ స్థానం పొందిన యంత్రం శ్రీచక్రం. మొత్తం భారతీయ ఆధ్యాత్మిక వ్యవస్థకు శ్రీచక్రం ఆలంబన. ఆది శంకరాచార్యులు కూడా తిరుపతి, ఇంద్రకీలాద్రి మొదలైన క్షేత్రాల్లో శ్రీచక్ర ప్రతిష్ఠ చేశారని చరిత్ర చెబుతున్నది. ఇప్పటికీ అనేక దుకాణాల్లో శ్రీచక్రాన్ని (చిన్నపాటి రాగిరేకు మీద చెక్కించినది), శ్రీచక్రం ఫొటోను పెట్టుకుని పూజ చేస్తుంటారు. శ్రీచక్రం అనే పేరు చెప్పగానే 'చాలా పవర్‌ఫుల్' అనే మాట ఇప్పటితరం కూడా అంటుంది. ఇంతటి సమున్నతమైన శక్తి కలిగిన శ్రీచక్రం గురించి నిశితంగా పరిశీలిస్తే భారతీయుల అనితరసాధ్యమైన వైజ్ఞానిక వైభవం సాక్షాత్కరిస్తుంది.

శ్రీచక్రం ఓ అద్భుతమైన గణిత నిర్మాణం. త్రిభుజాలు, వృత్తాలు, చతుర్భుజాలు, వలయాలు ఇందులో కనిపిస్తాయి. వీటన్నిటినీ ఒకదాని మీద మరొకటి అమర్చినట్లు 'త్రిమితీయ' (త్రీ డైమెన్షన్) రూపం కనిపిస్తుంది. దీన్నే మేరుప్రస్తార శ్రీచక్రం అంటారు. ఈ ఆకారం యంత్రాల మీద చెక్కిన రూపంలోనూ కనిపిస్తుంది. దీన్ని భూప్రస్తార శ్రీచక్రం అంటారు. ఇలా ద్విమితీయ, త్రిమితీయ అనే రెండు రూపాల్లో ఉన్న ఒకే ఒక్క నిర్మాణమిది. ప్రపంచంలో ఈరోజు వరకు మరెక్కడా ఇటువంటి నిర్మాణం లేదు. ఏ దేశంలోనూ, ఏ శాస్త్రవేత్తా ఇటువంటి నిర్మాణాన్ని చేయలేకపోయారు. దీన్నిబట్టి చూస్తే ఎన్నో యుగాల క్రితమే సనాతన భారతీయ హైందవ వైజ్ఞానికత ఎంత పరమోన్నత స్థాయిలో ఉన్నదో అర్థం అవుతుంది.

శ్రీచక్రం విశ్వానికి ప్రతిరూపం, బిందువు, వృత్తం, త్రిభుజి, చతుర్భుజి అనేవి లేకుండా ఏ యంత్రమూ ఉండదు. బిందువు విశ్వానికి మూలం. బిందువు కూడా వ్యాసార్థం లేని వృత్తమే! కాబట్టి బిందువూ, వృత్తమూ ఒకటే. బిందువును విస్తరింపజేస్తే వృత్తం అవుతుంది. దానిని అనంతంగా విస్తరిస్తూ పోతే విశ్వంగా (యూనివర్స్) మారుతుంది. విశ్వాన్ని ఒక అనంతముఖాలు ఉన్న బహుభుజి (infinite sided polygon) అనుకుంటే, దానిని తగ్గిస్తూ వెళ్తే మనకు మిగిలేది ఒక త్రిభుజమే. ఎందుకంటే అతి తక్కువ రేఖలతో ఏర్పడే జ్యామితీయ ఆకారం త్రిభుజం మాత్రమే. కాబట్టి, బిందువు, త్రిభుజం, వృత్తం, చతుర్భుజం వరుసలో శ్రీచక్రం ఉంటుంది.

బిందువు, త్రికోణం, చతుర్భుజం... ఈ మూడూ లేకుండా ఏ యంత్రమూ ఉండదు. ఏ పని చేయాలన్నా ఆ పని చేయాలనే 'ఇచ్ఛ' (కోరిక) కలగాలి. అదే ఇచ్ఛాశక్తి! తరువాత ఆ పని ఎలా చేయాలని ఆలోచన చేయడమే జ్ఞానశక్తి. ఇచ్ఛ, ఆలోచనా జ్ఞానం రెండూ కలిగిన తరువాత చేసే కార్యాచరణే క్రియాశక్తి. సృష్టికర్తకు దేనిని సృజించాలన్నా ఈ మూడు శక్తుల కలయిక తప్పదు.

ఇలా ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులను ఇచ్చేదే శ్రీచక్రం. త్రికోణంలోని మహాశక్తి రహస్యం ఇది. చరాచర సృష్టి మొత్తం మూడు శక్తుల కలయిక. ఈ మూడు శక్తులను సూచించేదే పరాదేవత అయిన అమ్మ. నేటి శాస్త్రజ్ఞులు కూడా ఏ పదార్థమైనా సరే, శక్తి రూపాంతరమేనని చెబుతున్నారు. నేడు మనం చూస్తున్న విజ్ఞాన శాస్త్రం ద్వారా కనిపెట్టిన వస్తుజాలం అంతా ఈ క్రియాశక్తి రూపాంతరమే.

ఇంకా ఎన్నో గణితశాస్త్ర విషయాలు, విశ్లేషణలు శ్రీచక్రం గురించి ఉన్నాయి. విదేశాల్లో ఇప్పటికీ శ్రీచక్రం గురించి పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. హైందవ సంస్కృతిలోని ఈ అపురూప నిర్మాణంలోని వైజ్ఞానికతకు అబ్బురపడుతున్నారు.

... శ్రీ భారతి


శ్రావణం, కార్తికం ఇలా ప్రత్యేక సందర్భాలతోపాటు ఏడాదంతా భారతీయులు శివాలయాలను సందర్శిస్తూ ఉంటారు. ముఖ్యంగా సోమవారాల్లో అయితే తప్పకుండా శివుడి దర్శనం చేసుకుంటారు. అంతేకాదు ఆదియోగికి జలాభిషేకం చేయడం పుణ్యప్రదంగా భావిస్తారు. దీనికోసం జలాన్ని నదుల నుంచి తీసుకువస్తారు. ఉత్తర భారతదేశం గంగా మైదాన ప్రాంతంలో అయితే కావళ్లలో కుండలను ఉంచి మరీ నదీ జలాలను వారివారి సొంత ప్రదేశాలకు మోసుకువస్తారు. పైగా ఎక్కడా కుండను నేలమీద ఉంచరు.



# శివుడి ముందు తాబేలు

ఇక మామూలుగా అయితే శివుడి ఆలయాలు గుహల్లాంటి నిర్మాణాల్లో కొలువై ఉంటాయి. గర్భాలయంలో శివలింగం కూడా దిగువన ఉంటుంది. దీంతో భక్తులు స్వామిని సరిగ్గా చూడటానికి అనుకూలంగా గోడలపై అద్దాలను కూడా ఉంచుతారు. భారతదేశంలో వందల సంవత్సరాలుగా పూజలు అందుకుంటున్న శివలింగాలను స్వయంభూ మూర్తులుగా పరిగణిస్తారు. వీటి ఆరాధన ఎప్పుడు మొదలైందన్నది కూడా ఎవ్వరికీ కచ్చితంగా తెలియదు. ప్రాథమికంగా ఉన్న నిర్మాణాలను అనుసరించి తర్వాత కాలంలో భారీ నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి.

కాగా, జ్యోతిర్లింగాల గురించి తొలి ప్రస్తావన మనకు క్రీస్తుశకం 8వ శతాబ్దానికి చెందిన ఆదిశంకరాచార్యుల రచనల్లో కనిపిస్తుంది. మహారాష్ట్రలోని ఎల్లోరాలో ఏకంగా కొండనే తొలిచి నిర్మించిన కైలాసనాథ దేవాలయం కూడా సుమారుగా శంకరాచార్యుల కాలానికి చెందిందే! భారతీయ వాస్తుశిల్పంలో అత్యుత్తమ నిర్మాణాల్లో ఒకటైన కైలాసనాథ దేవాలయానికి దగ్గర్లోనే ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం ఉంటుంది. ఇది స్వయంభూ లింగం కావడం విశేషం. కాలక్రమంలో ప్రజలు కైలాసనాథ దేవాలయాన్ని మర్చిపోయారు. కానీ, స్వయంభూ లింగమైన ఘృష్ణేశ్వరుణ్ని కొలవడం మాత్రం విడిచిపెట్టలేదు. అలా రాష్ట్రకూటుల రాజకీయ శక్తి కంటే భక్తుల విశ్వాసమే ఎక్కువని ఈ రెండు ఆలయాల నుంచి తెలుస్తుంది. జ్యోతిర్లింగాలు కొలువైన ఆలయాలను సందర్శించినప్పుడు సాధారణంగా శివుడికి ఎదురుగా నంది కనిపించడం సహజమే. అయితే నందికి, శివుడికి మధ్య ఓ తాబేలు కూడా ఉంటుంది. అంతగా పట్టించుకోని ఈ విషయం గురించి కొన్ని వివరణలు ప్రచారంలో ఉన్నాయి.



## యమునకు సంకేతం

ఒక వాదన ప్రకారం.. ఈ తాబేలు సకల జీవరాశికి కర్త అయిన బ్రహ్మదేవుడికి ప్రతిరూపమైన కశ్యప ప్రజాపతిని సూచిస్తుంది. కశ్యపుడికి ఎంతోమంది భార్యలు. వీరిద్వారా ఆయన విశ్వంలో మనుషులు సహా పక్షులు, సరీసృపాలు, గిట్టలు ఉన్న జంతువులు, గోళ్లు ఉన్న ప్రాణులు, ఆకాశంలో నివసించే దేవతలు, పాతాళంలో ఉండే ప్రాణులు.. ఇలా సకల జీవరాశినీ సృష్టించాడు. మరో వాదన ప్రకారం నంది ముందు ఉండే తాబేలు కూర్మావతారంలో ఉన్న విష్ణువుకు ప్రతినిధి. ఈ రూపంలో ఆయన మంధర పర్వతాన్ని తన వీపుమీద మోశాడు. పాల సముద్రాన్ని చిలకడానికి దీన్నే కవ్వంగా ఉపయోగించుకున్నారు. మరికొంతమంది అభిప్రాయంలో తాబేలు భూమిని సూచిస్తుంది. అంటే తాబేలు స్థిరత్వానికి గుర్తు అన్నమాట. అంతేకాదు భారతీయ ఆలయ సంప్రదాయం ప్రకారం తాబేలు యమునా నదికి సంకేతం. గర్భాలయంలో శివుడి మీద ఉండే గంగాళం గంగకు సంకేతమైతే, నందికి ముందు ఉండే తాబేలు యమునకు ప్రతీకగా పేర్కొంటారు. ఇక ఏదైనా సమస్య ఎదురైనప్పుడు తాబేలు తన అవయవాలను డొప్పలోకి లాక్కుంటుంది. యోగి కూడా తన ఇంద్రియాలను జయిస్తాడు. అలా తాబేలును యోగికి సంకేతంగా కూడా చెప్తారు. మరో వాదన ప్రకారం తాబేలు పార్వతికి ప్రతిరూపం. గుహలో కొలువైన ఆదియోగి శివుడిని బయటి ప్రపంచం (సంసారం)లోకి రమ్మని తాబేలు పార్వతి రూపంలో ఆహ్వానిస్తుందని అంటారు.



## ఇంద్రద్యుమ్నుడనే రాజే ఈ రూపంలో

మరోకథ ప్రకారం తాబేలును ఇంద్రద్యుమ్నుడనే రాజుకు గుర్తుగా భావిస్తారు. ఆయన ఓ పెద్ద కోనేరును నిర్మించాడని అంటారు. భారతదేశ వ్యాప్తంగా కోనేర్లలో తాబేళ్లను పెంచుతుండటం గమనించవచ్చు. తాబేళ్లు కోనేరును ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉంటాయి. అంతేకాదు, అవి ఆ కోనేరు ప్రాచీనతను చాటుతూ ఉంటాయి. ఎన్ని ఎక్కువ తాబేళ్లు ఉంటే కోనేరు అంత పరిశుభ్రంగా ఉంటుంది. అంత పురాతనమైనదని తెలుస్తుంది. ప్రాచీన కాలపు రాజులు ఆలయాలకు అనుబంధంగా కోనేర్లను నిర్మించడం వెనక రహస్యం కూడా ఇదే కావచ్చు. అలా వాళ్లు ఇంద్రద్యుమ్నుడిని స్మరించుకున్నారు. అయితే, భారీ నిర్మాణమే అయినప్పటికీ ఎల్లోరాలోని కైలాసనాథ దేవాలయంలో కోనేరు లేకపోవడం గమనార్హం.

మూలం : దేవదత్త పట్టనాయక్

# రెండు మార్గాలు



గీతావాక్యం

నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన।
తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున!
(భగవద్గీత 8-27)

'పార్థా! జీవిత గమనంలో రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి పునర్జన్మను పొందేది, మరొకటి జన్మరహితమైనది. భారతీయ సనాతన ధర్మంలో మరణించిన వ్యక్తిని కాల్చి బూడిదచేయడం.. ఆ బూడిదను నదులలో కలపడం ఆచారంగా ఉన్నది. అగ్ని, ప్రవహించే నీరు రెండు మార్గాలకు ప్రతీకలుగా తీసుకోవచ్చు. ఒకటి ముక్తికి మరొకటి పునర్జన్మకు ప్రతీకలుగా భావించవచ్చు. ఈ రెండు మార్గాల తత్త్వాలను తెలుసుకున్న యోగి వాటి భేదాలను అవగాహన చేసుకొని అవసరమైన దానిని పొందేందుకు ప్రయత్నిస్తాడే కాని మోహితుడు కాడు. ఇష్టమైన దానికోసం అవసరమైన దానిని వదిలివేయడం మోహంగా చెబుతారు. మోహం తానేమిటో మరిచే మార్గంలో నడుపుతుంది. తానేమిటో అనుభవపూర్వకంగా తెలుసుకొని ఆ మార్గంలో నడవడమే ఆత్మజ్ఞానంగా చెప్పుకోవాలి. మోహాన్ని వదిలితే సమత్వబుద్ధి కలుగుతుంది. కాబట్టి అన్ని కాలాల్లోనూ సమత్వబుద్ధితో యోగయుక్తుడవు కావాలి' అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నిస్సహాయత మానవత్వాన్ని కబళించివేయగా.. పరిపూర్ణంగా జీవించాల్సిన మనిషి.. గుడ్డిగా బతికేస్తున్నాడు. జీవితమంటే సుఖాలవెంట పరుగులు తీయడం కాదు.. దుఃఖాల కారణాలను ఛేదించుకుంటూ, గందరగోళాన్ని సృష్టించే సమస్యలను పరిష్కరించుకుంటూ, నిర్భయంగా, నిర్మోహంగా ముందుకు సాగడమే. ఆధ్యాత్మిక తత్త్వ సాధన.. మానసిక కాలుష్యాన్ని తొలగించుకొని ముందుకు సాగే ధైర్యాన్ని ఇవ్వాలే కానీ, పలాయనవాదంలోనికి నెట్టివేయకూడదు. మెదడు 'బీటా' స్థాయులలో ఉన్నప్పుడు స్థిరతను కోల్పోయి వ్యగ్రతను ఆశ్రయిస్తుంది. దానిని 'డెల్టా' స్థాయికి తీసుకువస్తే.. సరైన నిర్ణయాలు తీసుకొని స్థిరతను సాధిస్తుంది. డెల్టా స్థాయిలో మెదడు సుషుప్త్యావస్థలో ఉంటూ.. నాలుగుకన్నా తక్కువ తరంగాలను వెలువరిస్తే, బీటా స్థాయిలో 13 నుంచి 30 వరకు తరంగాలను వెలువరిస్తుంది.

'శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః' అంటుంది కఠోపనిషత్తు. మనిషికి అవసరమైనది.. శ్రేయస్సు. ఇది సుగతిని ఇస్తుంది. ఇష్టమైనది.. ప్రేయస్సు. ఇది ప్రగతి నిస్తుంది. ఒకదాన్ని ఆదరిస్తే మరొకదానిని వదిలేసుకోవాలి. ఎవరైతే ఈ రెండిటి తత్త్వాలను అవగాహన చేసుకుంటారో వారు సమత్వమైన బుద్ధితో రెండిటినీ సమన్వయం చేసుకుంటూ రసమయమైన జీవితాన్ని ఆస్వాదిస్తారు.. ఆదర్శప్రాయం చేసుకుంటారు. భౌతిక ఆధ్యాత్మిక జీవన యాత్రలో మార్పు అనివార్యమైనది. మార్పులేని చోట అభ్యుదయం లేదు. భగవద్గీత కూడా కృష్ణ పక్ష, శుక్ల పక్షాల గురించి చెబుతుంది. అంతరంగంలోని ప్రజ్ఞను జాగృతం చేసుకొని, ఆత్మతత్త్వాన్ని అవగాహన చేసుకొని, కష్ట సుఖాలను సమంగా తీసుకోవడం శుక్ల పక్షంగానూ దానికి విరుద్ధమైన దానిని కృష్ణ పక్షంగానూ తెలియజేస్తుంది. నిజానికి ఈ రెండు మార్గాలూ మానవులు తప్పనిసరిగా అనుభవించవలసినవే. ఒకదాని నుంచి తప్పుకొని మరొకదానిని మాత్రమే ఆశ్రయిస్తాననడం అసాధ్యమైన ప్రక్రియ. జగత్తనే పక్షికి సుఖదుఃఖాలనే రెండు రెక్కలు ఉంటేనే ఎగరగలుగుతుంది.


ఎప్పుడైతే మానవుడు తాను చేసే పనిని ఉపాసనగా భావించి.. భగవదర్పితంగా, ప్రక్రియ ఆధారితంగా నిర్వహిస్తాడో అది సత్ఫలితాన్ని ఇస్తుంది. చేసేపనిలో ఫలితానికి అతుక్కుపోకుండా కర్మలను ఆచరించడం వల్ల ఒత్తిడి తగ్గి సామర్థ్యం, నైపుణ్యం పెరుగుతుంది. అయితే చేసేపనిలో శ్రద్ధ, ఆసక్తి, నిష్ఠ అవసరం. హృదయ పూర్వకంగా పూర్తిగా శక్తిసామర్థ్యాలను వినియోగించి ప్రక్రియ ఆధారంగా కర్తవ్యాన్ని నిర్వహించినా ఫలితం రాకపోతే చింతించవలసిన అవసరంలేదు. లభించిన ప్రతిఫలాన్ని కృతజ్ఞతా భావనతో స్వీకరించడం వల్ల హృదయం తేలికవుతుంది. నిస్వార్థమైన సేవాభావన ఒత్తిడి లేని పని విధానానికి మార్గం చూపుతుంది. ఎప్పుడైతే మన పనుల వల్ల ఇతరులు లాభపడతారో వారి ఆశీస్సులు అయాచితంగానే మనకు లభిస్తాయి. అది ఎప్పుడైనా మనకు ఉపకరించేదే. ముఖ్యంగా అహంకార మమకారాదులకు దూరంగా కర్మఫలాన్ని త్యాగం చేయడం వల్ల ఉన్నస్థితి నుండి ఉన్నతస్థితికి చేరుకునే ప్రయాణం సులువవుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

కథాసుధ

# జాలరి వల

ఓ ఊళ్లో ఒక జాలరి ఉండేవాడు. అతని కొడుకు పట్టణంలో చిన్న ఉద్యోగం చేస్తుండేవాడు. రెండు రోజుల సెలవు దొరికిందని జాలరి కొడుకు ఇంటికి వచ్చాడు. అదే సమయానికి జాలరి వల తీసుకుని చేపలు పట్టడానికి నదికి బయల్దేరుతున్నాడు. తను కూడా వస్తానని జాలరిని అనుసరించాడు కొడుకు. ఇద్దరూ పడవలో వెళ్తూ ఉన్నారు. కొడుకు మౌనంగా, దిగులుగా ఉండటం జాలరి గమనించాడు. 'ఎందుకలా ఉన్నావ'ని ప్రశ్నించాడు. 'డిగ్రీ వరకు చదివినా చిన్న ఉద్యోగం చేస్తున్నందుకు బాధగా ఉంద'ని చెప్పాడు. తన తోటి మిత్రులకు పెద్ద ఉద్యోగాలు దొరికాయని, దండిగా సంపాదిస్తున్నారని, ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పాడు. వెంటనే జాలరి వలను కొడుకు చేతికి ఇచ్చి నదిలోకి విసరమన్నాడు.



తండ్రి చెప్పినట్టే వలను నదిలోకి విసిరాడు. వలలో కొన్ని చేపలు పడ్డాయి. వెంటనే విసిరిన వలను పైకి లాగమన్నాడు జాలరి. అలాగే చేశాడు కొడుకు. వలను పైకి లాగాక, 'నదిలో చేపలన్నీ వలలో పడ్డాయా?' అని అడిగాడు జాలరి. 'లేదు, కొన్నే పడ్డాయి. అయినా నదిలో చేపలన్నీ మన వలకే ఎలా పడతాయి?' అని ఎదురు ప్రశ్న వేశాడు కొడుకు. చిన్నగా నవ్విన జాలరి 'నదిలో చేపలు చాలా ఉన్నా, మన వలలో కొన్నే పడతాయి. మనకు దొరికిన చేపలే మనకు 'బంగారం' అనుకోవాలి. వేరే జాలర్లకు దండిగా చేపలు దొరికాయని బాధపడుతూ కూర్చుంటే లాభమేమి? నదిలో చేపలన్నీ మనకు దొరకలేదని ఏడుస్తూ కూర్చుంటే సుఖమేమి? జీవితంలో అవకాశాలు కూడా అంతే... అందరికీ అన్నీ రావు. వచ్చిన అవకాశాలను భక్తిగా స్వీకరించాలి. బాధ్యతగా వ్యవహరించాలి. మనసు పెట్టి చేయాలి. దొరికిన ఫలితంతో తృప్తిగా జీవితం గడపాలి. తృప్తికి మించిన సంపద లేదు. చిన్నదో, పెద్దదో దొరికిన ఉద్యోగాన్ని సక్రమంగా చెయ్యి. మనతోపాటు చేపల వేటకు బయలుదేరిన చాలామందికి మనకు దొరికినన్ని చేపలు కూడా దొరకలేదన్న విషయం గుర్తించు' అని హితబోధ చేశాడు. 'నిజమే... నేను చేసే ఉద్యోగం లాంటిది కూడా చాలామందికి దొరక్క బాధ పడుతున్నారు' అనుకుంటూ చేపల్ని తీసుకుని సంతోషంగా ఇంటి వైపు నడిచాడు కొడుకు.


... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

# మనమంతా బంధువులమే

ఈ విశాల విశ్వం దేవుడి సృష్టి. ఆ దేవుడి చేతిలోనే మనిషి జీవన్మరణాలు ఉన్నాయి. ఆయురారోగ్యాలైనా, సౌభాగ్య దౌర్భాగ్యాలైనా అన్నీ దైవం హస్తగతమై ఉన్నాయి. ఒక్కడైన దేవుడిని ఆరాధించడానికే మనిషి పుట్టాడు. దేవుడి ప్రవక్తలంతా ఇదే బోధించారు. ఈ భావన మనుషుల మధ్య విభేదాలను, వైషమ్యాలను తొలగిస్తుంది. మనుషులందరినీ ఒక్కటి చేస్తుంది. దైవానికి దాస్యం చేయాలన్న స్పృహ వల్ల సేవకుడు– యజమాని, పాలకుడు– పాలితుడు, కూలివాడు– యజమాని, నల్లవాడు– తెల్లవాడు, అధికుడు– అల్పుడు అంతా కలిసి ఒకే పంక్తిన దైవారాధనలో నిలబడతారు. మానవాళి అంతా ఒకే ప్రాణి ద్వారా ఉనికిలోకి వచ్చిందని ఖురాన్ అనేక పర్యాయాలు నొక్కి చెప్పింది. 'మానవులారా, మీ ప్రభువునకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించాడు. అదే ప్రాణి నుంచి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంటద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపచేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకొని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో ఆ దేవునికి భయపడండి' (దివ్య ఖురాన్ 4:1). ఈ విధంగా ఇస్లామ్ మనుషులంతా ఒకే కుటుంబానికి చెందిన వాళ్లనీ, మనమంతా సోదర సమానులనీ చెబుతుంది. అందుకే మనమంతా బంధువుల్లా మెలుగుదాం.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

ఇస్లాం బోధ



# దైవం విసిరిన అస్త్రం

దేవుడు ఎందులోనూ తాను ప్రత్యక్షంగా పాల్గొనడనేది విదితం. తన కార్యానికి తన భక్తుల్నే ప్రయోగిస్తాడు. అలాగే పాపం పెరిగినప్పుడు దేవుని సూచన జరిగి తీరుతుంది. అది వినక పోతే, గట్టి హెచ్చరిక జారీ అవుతుంది. ఇందుకు బైబిల్‌లో ఒక పురాతన ఉదంతం ఉదాహరణగా కనిపిస్తుంది. అది 'నినెవే' అనే పట్టణం, సకల పాపాలకు విత్తనం. అది బహు విలాసవంతంగా ఉండేది. ఎడతెగని దుర్మార్గాలకు కేంద్రంగా ఉండేది. వినోద భరితం. దానిది విచ్చలవిడి చరితం! అందుకు దేవుడు వారికి ప్రమాద హెచ్చరికలు చేయాలి. ఆ విషయం చెప్పడానికి ప్రభువు, యోనా అనే వ్యక్తిని ఎన్నుకున్నాడు. యోనా ఇలాంటి పనులకు ససేమిరా ఇష్టపడని వ్యక్తి. అందుకే దైవవాక్కును తప్పించుకునే ప్రయత్నంతో పారిపోయి హడావుడిగా ఒక ఓడ ఎక్కేస్తాడు. అది శత్రువుల ఓడ. తెలియక వారి మధ్య చిక్కుకుంటాడు. వారు అతని ఆచూకీ కనిపెడతారు. కాళ్లూచేతులూ కట్టేసి సముద్రంలో పడేస్తారు. అందరూ ఇక చచ్చాడులే అనుకుంటారు. ఒక పెద్ద చేప వచ్చి యోనాను మింగేస్తుంది. మూడు రోజుల పాటు అతను ఆ చేప గర్భంలోనే ఉండిపోతాడు. మూడో రోజు మత్స్యం గర్భంలో నుంచి ఆణిముత్యంలా పైకి వస్తాడు. అయితే దేవుడు చెప్పిన పని చేస్తాడు. ఆ పట్టణవాసులకు జాగ్రత్తలు, హెచ్చరికలు సూచిస్తాడు. దైవ కార్యం నెరవేరుతుంది. అతను అలా సురక్షితుడు కావడానికి దైవ సంకల్పమే కారణమని పెద్దల వివరణ. తన భక్తులను అన్ని విపత్తుల నుంచీ దేవుడు ఎలా రక్షించుకుంటాడో ఈ కథ ద్వారా తెలుస్తుంది. కాబట్టి దేవుడు ఒక్కోసారి పెద్దల ద్వారా తాను చెప్పదలచింది అందిస్తాడని, దాన్ని మనం వినయంతో వినాలనేది ఇందులోని నీతి.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

క్రీస్తు సందేశం

